# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 305 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 15-12 -2024 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.





### మొదలైన ఇందిరమ్మ
## ఇళ్ల లబ్ధిదారుల సర్వే

- డిసెంబర్ 31 వరకు పూర్తి
- పలు జిల్లాల్లో మార్గ దర్శకాలను జారీచేసిన కలెక్టర్లు

**హైదరాబాద్, 14 డిసెంబర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక సర్వే మొదలైంది. శనివారం నుంచి మొదలైన ఈ సర్వే, డిసెంబర్ 31 వరకు జరగనుంది. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించిన జిల్లా కలెక్టర్లు అందుకు

-మిగతా 5 లో



### తెలంగాణ అమరవీరుల
## త్యాగాలకు ఫలితం దక్కాలి

- తెలంగాణ అభివృద్ధికి అన్ని పార్టీలు రాజకీయాలకుఅతీతంగా పని చేయాలి
- రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, కేసీఆర్ ప్రతిపక్షానికి, బీజేపీ ఎంపీలకు మేలిమాట

**హైదరాబాద్,14 డిసెంబర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారు. వారి త్యాగాలకు నిజమైన గౌరవం అంటే, రాష్ట్రం అభివృద్ధి బాటలో ముందుకు సాగడం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత కేసిఆర్, కేంద్రంలోని బీజేపీ ఎంపీలు కలిసి పనిచేయాల్సిన

-మిగతా 2 లో




## నేటి నుంచి గ్రూపు-2 పరీక్షలు

- పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు
- తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్, 14 డిసెంబర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర వ్యాప్తంగా రేపు, ఎల్లుండి గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను

-మిగతా 2 లో



## రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలి

-బీజేపీ రాజ్యాంగాన్ని రక్షిస్తాననడం విడ్డూరం
-లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

**న్యూఢిల్లీ,**
రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెబితే ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రక్షిస్తామని అనడం విడ్డూరంగా ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

-మిగతా 2 లో



- 98 శాతం కులగణన పూర్తి
- ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయ్
- అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నాం
- రైతాంగ పోరాటంలో తెగువ చూపిన దొడ్డి కొమురయ్య
- కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి
- ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయను
- అందరికీ న్యాయం చేసే బాధ్యత నాదే
- గ్లోబల్ మాదిగ డే కార్యక్రమంలో సిఎం

### దేశానికే ఆదర్శంగా
## కులగణన



**హైదరాబాద్, 14 డిసెంబర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నామని అన్నారు.. ఆ విగ్రహం మన అమ్మకు, అక్కకు ప్రతిరూపమని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా కులగణన చేపడుతున్నామని వివరించారు. 98 శాతం కులగణన జరిగిందని వెల్లడించారు. హైదరాబాద్?లోని కోకాపేట్?లో కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

-మిగతా 2 లో



### కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల
## పాలిట శాపం

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించిన హరీశ్‌రావు
- వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం
- కనీసం నాణ్యమైన ఆహారాన్ని కూడా అందించలేరా..? - హరీశ్‌రావు

**హైదరాబాద్, 14 డిసెంబర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యార్థుల ఆరోగ్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తద్వారా విద్యార్థులు ప్రాణాలు సంకటంగా మారాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

-మిగతా 2 లో




## సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమే

- దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుంది
- అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారు
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ కౌంటర్!

**హైదరాబాద్,**
కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి అల్లు అర్జున్‌కు మద్దతుగా మాట్లాడారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. “సినిమావాళ్లు చేసేది పక్కా బిజినెస్. హీరోలు డబ్బులు పెడుతున్నారు.. ఆ తర్వాత సంపాదించుకుంటున్నారు.

-మిగతా 2 లో



## మార్చి 3నుంచే ఇంటర్ పరీక్షలు!!

- తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు!
- పరీక్షల తేదీలపై కసరత్తు చేస్తున్న అధికారులు
- అధికారికంగా ప్రకటన వెలువడడమే తరువాయి

**హైదరాబాద్, 14 డిసెంబర్ నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇంటర్ పరీక్షల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని, షెడ్యూల్ ఖరారు చేసే అంశం తుది దశలో ఉందని అధికార వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ దాదాపుగా ఖరారైందని వివరించాయి. వచ్చే వారంలో అధికారికంగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అనధికారిక సమాచారం ప్రకారం..

-మిగతా 2 లో

# రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలి

(మొదటి తరువాయి)

వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో రాహుల్ పాల్గొన్నారు. రాజ్యాంగంలో అసలు భారతీయతే లేదనీ, దాని స్థానంలో మనుస్మృతి ఉండాలని ఆర్?ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ చెప్పిన మాటలను రాహుల్ గుర్తు చేశారు. ఏకలవ్యుడి బొటనవేలిని ద్రోణుడు నరికించినట్లే అదానీ, అంబానీ లాభం కోసం చిన్న వ్యాపారుల వేలిని బీజేపీ కత్తిరించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. అగ్నివీర్, ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. మద్దతుధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనావేలిని కత్తిరించారని దుయ్యబట్టారు. సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ సమానత్వం ఉండదని అంబేద్కర్ చెప్పారన్న రాహుల్, కులగణనతో సమానత్వం వైపు అడుగులేస్తామని తెలిపారు. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారిత వివక్షను నిషేధించాలని రాజ్యాంగం చెబితే బీజేపీ మాత్రం విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని తెలిపారు. మనుస్మృతి వంటి ప్రాచీన విధానాలతోనే దేశం నడవాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగం గురించి, భారతదేశాన్ని ఎలా నడపాలని ఆర్ఎస్ఎస్ సుప్రీం లీడర్ సావర్కర్ భావించారో చెబుతూ నా ప్రసంగాన్ని ప్రారంభించాలను కుంటున్నాను. “రాజ్యాంగంలో చెత్త విషయం ఏమిటంటే, దానిలో భారతీయత ఏమీ లేదు. మనుస్మృతి అనేది మన హిందూ దేశానికి వేదాల తర్వాత అత్యంత పూజనీయమైనది. మన ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు ఆధారమైంది.” ఇవి సావర్కర్ చెప్పిన మాటలు. సావర్కర్ తన రచనల్లో మన రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగాన్ని మనుస్మృతితో భర్తీ చేయాలని ఆయన చెప్పారు. దానికి వ్యతిరేకంగానే మేం పోరాటం చేస్తున్నామన్నారు. మరోవైపు, భారత్‌లో అందరికీ సమాన ఓటు హక్కు ఉన్నప్పటికీ ఇక్కడ మైనారిటీలకు ఎలాంటి హక్కులు ఉండడం లేదని దుష్ప్రచారం చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ విపక్షాలకు హితవు పలికారు. 75 ఏళ్ల రాజ్యాంగ ప్రస్తానంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో మాట్లాడిన రిజిజూ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్‌తోపాటు ప్రభుత్వాలు కూడా ఎంతో కృషి చేశాయని చెప్పారు. ఇప్పుడు విపక్షాలు వారి వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దిగజార్చవద్దని హితవు పలికారు. భారత్‌లో మైనారిటీలకు చట్టబద్ధమైన భద్రత ఉందన్న మంత్రి ప్రభుత్వం ఆ నిబంధనకు కట్టుబడి ఉందని వివరించారు. ఐరోపా దేశాల్లో 48 శాతం మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు వివక్ష ఎదుర్కొంటున్నారని ఒక సర్వేలో తేలిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో బురా?లు ధరించిన ముస్లింలపై అభ్యంతరం వ్యక్తం అవుతోందని గుర్తుచేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లోని సిక్కులు, హిందువులు, క్రైస్తవుల పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందేనని వివరించారు. టిబెట్‌లో అయినా మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లో అయినా- మైనారిటీల పట్ల అణచివేత జరిగితే, వారికి ఏదైనా కష్టం వస్తే వారు రక్షణ పొందేందుకు మొదట వచ్చే దేశమేదైనా ఉందంటే అది భారతదేశమే. ఇది సురక్షితం కాబట్టే ఇక్కడకు వస్తారు. అలాంటప్పుడు ఈ దేశంలో మైనారిటీలకు భద్రత లేదని ఎలా అంటారు ? మైనారిటీ, మెజారిటీ వ్యక్తుల మధ్య, ప్రతీ ఇంట్లో ప్రతీ కుటుంబంలో చిన్న చిన్న గొడవలు రావడం సహజం. అంతమాత్రాన దేశ ప్రతిష్టను దెబ్బతీసే మాటలు మాట్లాడకూడదు. ఒక పార్టీ కోసం ఈ మాట చెప్పడం లేదు, దేశం కోసం చెబుతున్నారాణి అన్నారు.

# నేటి నుంచి గ్రూపు-2 పరీక్షలు

(మొదటి తరువాయి)

ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. 783 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ విడుదలైంది. పలు కారణాల వల్ల గ్రూప్-2 పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తో పాటు ఇటీవల దిగిన పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వంచే జారీ చేయబడ్డ ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇక మహిళా అభ్యర్థులకు మంగళసూత్రం, గాజుల వరకే అనుమతించనున్నారు. ఇతర ఆభరణాలు ఉంటే అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చెప్పులే ధరించాలన్నారు. బెల్ట్‌లు, రిమోట్ కీస్‌కు అనుమతి లేదని తెలిపారు.

# సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమే

(మొదటి తరువాయి)

వాళ్లేమైనా సరిహద్దుల్లో సైనికుల వలే యుద్ధాలు చేస్తున్నారా?” అని నిన్న ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ స్పందించారు. సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమేనని అన్నారు. దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుందని తెలిపారు. దేశభక్తి కేవలం సరిహద్దుల్లోనే కాదు, ప్రజల్లో స్ఫూర్తి నింపడంలో కూడా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అనేక సినిమా పాటలు దేశాన్ని కదిలించాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారని, ఆయన విషయంలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

# దేశానికే ఆదర్శంగా కులగణన

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా కురుమల నిజాయితీని, గొప్పతనాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కురుమలు అత్యంత నమ్మకస్తులని తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, ఊళ్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని చెబుతుంటానని తెలిపారు. పార్లమెంటులో కూడ కురుమ సోదరుల ప్రాతినిధ్యం పెంచుతామని చెప్పారు.”కురుములకు భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చి ఇస్తారు.. వారు ఇచ్చిన డబ్బును లెక్కపెట్టుకోవాల్సిన అవసరం లేదు. దొడ్డి కొమురయ్య ఆనాడు రైతాంగ పోరాటంలో తెగువ చూపారు. దొడ్డి కొమురయ్య రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపారు. కురుమలు తెలంగాణ పునర్?నిర్మాణంలో భాగస్వాములు కావాలనేది ప్రభుత్వ కోరిక. ఈ కురుమ భవనం విద్యకు వేదిక కావాలని అన్నారు. కురుమలకు, యాదవులకు రెండేసి చొప్పున ఎంపీ సీట్లు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి గుర్తు చేశారు. కురుమలను గెలిపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. గెలవకపోతే టికెట్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నలు వస్తాయని చెప్పారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కురుమ వర్గానికి చెందిన వ్యక్తినేనని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయనని, రిజర్వేషన్ల విషయంలో అందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని తెలిపారు. హైదరాబాద్ లోని హోటల్ దసపల్లాలో గ్లోబల్ మాదిగ డే %-% 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం ఓ వర్గం చేస్తున్న పోరాటానికి మద్ధతుగా.. ఇటీవల సుప్రీం కోర్టు నుంచి సానుకూల తీర్పు వెలువడింది. దానిని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులోని మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించినట్లు వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ మాదిగ కుల ఉపకులాల రిజర్వేషన్లపై స్పష్టమైన విధానాన్ని తెలియజేసిందని తెలిపారు.ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎన్నికల సమయంలోనే తమ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు దానంతట అదే రాలేదని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు అనుకూలంగా తీర్పు రావటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహా గారి నేతృత్వంలో ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించి వాదనను వినిపించినట్లు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు విలువరించటంతో ఇక రాత్రష్ట ప్రభుత్వం సైతం ఆ తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదిక ప్రకటించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ సమస్యలానే ఎస్సీ వర్గీకరణ సమస్యను జఠిలంగా మారిపోయిందన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తరాలుగా మాదికలు ఆకాంక్షిస్తున్నట్లుగా రిజర్వేషన్ల వర్గీకరణ అంశంలో న్యాయం ఉందని.. వారికి న్యాయం చేయాలని ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యచరణ మొదలుపెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా వర్గీకరణను అమలు చేసేందుకు చేపట్టాల్సిన విధివిధానాలు పై అధ్యయనం చేసేందుకు అధ్యయనం చేస్తున్నామని, అందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించినట్లు తెలియజేశారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యూడిషియల్ కమిషన్ సైతం నియమించినట్లు వెల్లడించారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల పాలిట శాపం

(మొదటి తరువాయి)

విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్‌లో ఉంచి వారికి చికిత్స అందించారని పేర్కొన్నారు. నాలుగు రోజులు గడించినా అయినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదు. విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. మౌనంగా ఇలా నిమ్స్ ఆసుపత్రి బెడ్‌పై ఉండటం చూస్తే మనసు కలిచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నది అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థులకు చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నది. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యా మంత్రి, ఎస్సీ, ఎస్టీ మంత్రి కూడా రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం. చూడడానికి వెళ్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటారు. సబితా ఇంద్రా రెడ్డిని, సత్యవతి రాథోడ్‌ని అరెస్టు చేశారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, కనీసం జిల్లాలో ఉన్న పిల్లల భవిష్యత్తుపై లేదా? నిన్న నల్గొండ %-% కేతేపల్లి మండలం గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న నీలం సాయి గణేష్ పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రి పాలయ్యాడు. ఫుడ్ పాయిజన్ కేసులు, కుక్క కాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాక్‌లు నిత్య కృత్యం అవుతున్న ప్రభుత్వం ముద్దు నిద్ర వేడడం లేదు. ఇప్పటి వరకు 49 మంది విద్యార్థులు చనిపోతే ఉలుకు లేదు పలుకు లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణ అమరవీరుల త్యాగాలకు ఫలితం దక్కాలి

(మొదటి తరువాయి)

అవసరం ఉంది.

**రేవంత్ రెడ్డి సవాళ్లను అవకాశాలుగా మార్చాలి**

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ముందున్న బాధ్యతలు సామాన్యమైనవి కావు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ఆర్.ఆర్.ఆర్ వంటి ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. రేవంత్ తన నాయకత్వంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇతర పార్టీ నాయకులతో కలసి పనిచేయడం ద్వారా ప్రజల మన్నన పొందాల్సిన సమయం ఇది.

**కేసీఆర్ దూరదృష్టితో పని చేయాలి**

ప్రతిపక్ష నేతగా కె. చంద్రశేఖర్ రావు కొత్త పాత్రలో నిలవాల్సిన సమయం ఇది. తెలంగాణ సాధన కోసం చేసిన పోరాటం ఎంత గొప్పదో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ప్రతిపక్షంగా ఆయన రాష్ట్ర ప్రయోజనాల కోసం నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. ప్రభుత్వంపై విమర్శలు చేయడమే కాకుండా, అవసరమైన అంశాల్లో మద్దతు ఇవ్వడం ఆయన నేతృత్వం కొత్త కోణాన్ని ప్రజలకు చూపుతుంది.

**బీజేపీ ఎంపీల పాత్ర కీలకం**

తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ఎంపీలు సమర్థవంతంగా పనిచేయాలి. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి,రఘునందన్ రావు వంటి నాయకులు తమ బాధ్యతను గుర్తుంచుకోవాలి. రాష్ట్రం నుంచి ఎంపీలుగా ఎంపికైన వీరు కేంద్రంతో సంబంధాలను బలపరచి, రాష్ట్ర ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలి. తెలంగాణ ప్రజలకు కేంద్రంలో బలమైన



ప్రాతినిధ్యం అందించడంలో వీరి పాత్ర మౌలికంగా ఉంటుంది.

**అఖిలపక్ష సమావేశం-సమష్టి కృషికి వేదిక**

రాజకీయాలకు అతీతంగా, రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. ఈ సమావేశంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ సహా అన్ని పార్టీలు పాల్గొని, కేంద్రానికి సమిష్టి విజ్ఞప్తి చేయాలి.

- బీజేపీ ఎంపీలు కేంద్రంతో నేరుగా సంబంధాలను ఉపయోగించి నిధులు తీసుకురావడం.

-కెసీఆర్ నాయకత్వంలోని ప్రతిపక్షం - రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి సానుకూల వాతావరణం కల్పించడం.

-రేవంత్ రెడ్డి ప్రభుత్వం - అన్ని పార్టీలను కలిపి వ్యవహరించేందుకు నాయకత్వం వహించడం.

**సమష్టి కృషి ద్వారా తెలంగాణకు భరోసా**

ఈ రాజకీయ సమీక్ష తెలంగాణకు అభివృద్ధి బాటను తెరుస్తుంది.

-కేంద్రం నుంచి నిధులు సాధించడంలో బీజేపీ ఎంపీల భాగస్వామ్యం రాష్ట్ర ప్రయోజనాలను సులభతరం చేస్తుంది.


-రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేయడం ద్వారా ప్రజల నమ్మకం పెరుగుతుంది.

-తెలంగాణ కోసం ఐక్యతతో పనిచేసే ఈ విధానం దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది.

తెలంగాణ బలపడాలంటే రాజకీయ విభేదాలను పక్కన పెట్టి పని చేయాల్సిందే. రేవంత్ రెడ్డి, కేసిఆర్, బీజేపీ ఎంపీలు కలిసి పనిచేస్తే, తెలంగాణ ప్రజల ఆశయాలు నిజం అవుతాయి. రాజకీయాలను పక్కనబెట్టి, తెలంగాణ కోసం సమష్టిగా కృషి చేద్దాం!

# మార్చి 3నుంచే ఇంటర్ పరీక్షలు!!

(మొదటి తరువాయి)



మార్చిలో పరీక్షలు నిర్వహించాలని, ఆ నెలాఖరులోగా అన్ని పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అనుగుణంగా మార్చి 3వ తేదీ నుంచే ఇంటర్ పరీక్షలు ప్రారంభిచనున్నట్లు సమాచారం. ఇంటర్ అన్ని గ్రూపులకు చెందిన పరీక్షలు నిర్వహించేందుకు దాదాపు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. నెలాఖరులోగా పరీక్షలు పూర్తిచేయాలంటే మార్చి 3న పరీక్షలు ప్రారంభించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఇక, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఫిబ్రవరిలో పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షల ఫీజు గడువు డిసెంబర్ 3 తో ముగియగా ఆలస్య రుసుముతో జనవరి 2 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డ్ కల్పించింది. రూ.2 వేల ఆలస్య రుసుముతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 9 నుంచి 10 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతారని ఇంటర్ బోర్డ్ అధికారులు తెలిపారు. దీనికి తగ్గట్లు రాష్ట్రంలో పరీక్షలకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

# "సామాన్యుడికి న్యాయం ఎక్కడ?"

**-సెలబ్రిటీలకు రాజకీయనాయకుల మద్దతుపై ప్రజల ఆవేదన**





**హైదరాబాద్,14 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఈ సమాజంలో చట్టం అందరికీ సమానమని చెబుతాం. కానీ, కొన్ని సంఘటనలు చూస్తే సామాన్య పౌరుడు, సెలబ్రిటీ, -లేదా రాజకీయనాయకుడి మధ్య న్యాయం నిలిచే తీరు కచ్చితంగా వేరుగా కనిపిస్తోంది. ఇది ప్రజలలో అసహనం, నిరాశను పెంచుతోంది.

**సెలబ్రిటీలకు ప్రత్యేక ప్రాధాన్యత**

ఇటీవలి కాలంలో ఒక చిన్న కథానాయకుడిని పోలీసులు అరెస్టు చేయగానే, రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రులు, పార్టీ నేతలు సైతం స్పందించడం ఆశ్చర్యకరంగా ఉంది.

-ఒక సెలబ్రిటీకి చిన్న ఇబ్బంది కలిగినా, ఆ సంఘటనకు పెద్ద మద్దతు లభిస్తోంది.

-ప్రతీ రాజకీయ పార్టీ, సెలబ్రిటీల పక్కన నిలుస్తున్న తీరు సామాన్య ప్రజలకు అవమానంగా మారుతోంది.

**సామాన్యుల సమస్యలకు పట్టింపు లేదా?**

అదే సమయంలో, రైతులు భూములు కోల్పోతుంటే, నిరుద్యోగులు తమ న్యాయం కోసం పోరాడుతుంటే, ఎవరికీ పట్టడం లేదు.

-రైతు ఆత్మహత్యలు రోజువారీ వార్తలుగా మారుతున్నాయి, కానీ ఒక నాయకుడైనా స్పందించడం చాలా అరుదు.

-సామాన్యుల సమస్యలపై న్యాయవ్యవస్థలో వేగంగా స్పందన దక్కడం దుర్లభం.

**సెలబ్రిటీలను రాజకీయ పార్టీలు వాడుకుంటున్నారా?**

సెలబ్రిటీలకు ఉన్న ప్రజాదరణ, వారి గొంతును రాజకీయ పార్టీలు తమ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని అనిపిస్తోంది.

-వారు ఓటు వేయకపోయినా, అవసరం అనిపిస్తే ఒక్క ట్వీట్ చేస్తే సరిపోతుంది.

-సామాన్యులు, రైతులు ఏదైనా పోరాటం చేస్తే రాజకీయ నాయకుల నుంచి ఎలాంటి మద్దతు రావడం లేదు.

**రైతుల ఆవేదనకు స్పందన ఎక్కడ?**

ఒక రైతును బేడిలతో జైలు పంపినా, భూములు లాక్కున్నా, వారి పైన దాడులు జరిగినా ఎవరు స్పందించరు.

-సామాన్యుడికి న్యాయం కావాలంటే పెద్ద ఉద్యమం చేయాల్సి వస్తుంది.

-ఇలాంటి సందర్భాల్లో పోలీసుల బలవంతాలు, న్యాయవ్యవస్థ ఆలస్యం సామాన్యుడి నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి.

**రాజకీయ నాయకుల విధి ఏమిటి?**

రాజకీయ నాయకులు సెలబ్రిటీలకు చూపిస్తున్న ఆసక్తిని సామాన్య ప్రజల సమస్యల పట్ల కూడా చూపాలి.

-రైతులకు, కార్మికులకు న్యాయం జరిగేలా ముందుకు రావాలి.

-చట్టం ప్రతి ఒక్కరికి సమానంగా అమలయ్యేలా చూడాలి.

**సమాజం కోసం సమానత అవసరం**

చట్టం, న్యాయవ్యవస్థ సామాన్యుడు, సెలబ్రిటీ, రాజకీయనాయకుడు అన్న తేడా లేకుండా పనిచేయాలి.

-న్యాయవ్యవస్థ వేగంగా స్పందించాలి.

-సామాన్య ప్రజల సమస్యలను కూడా ప్రతిష్టాత్మకంగా చూడాలి.

సెలబ్రిటీలకు మాత్రమే న్యాయం కాదు, సామాన్య ప్రజలకు కూడా సమాన అవకాశాలు ఉండాలి. రాజకీయ నాయకులు నైతికతతో, సమాజ సంక్షేమ దృష్టితో ముందుకు రావాలి. న్యాయం అంటే కేవలం ప్రసిద్ధులకు మాత్రమే కాదుబీ అందరికీ అవసరం.

# జానంపేట గుండుకేరి హనుమాన్ మరియు శివాలయం దేవాలయాల పునః నిర్మాణానికి సహకరిద్దాం





**-ఆలయ నిర్మాణానికి దాతల సహాయం**

**-బీమారం వీరేశం గారు 101,000/-**

**-కొక్కునూరి ప్రవీణ్ గారు 41,000/-**

**-7th వార్డ్ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు గారు 11,000/-**

**-BAM డిగ్రీ కళాశాల నాగరాజు గారు 11,000/-**

**షాద్ నగర్,డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆధ్యాత్మికత అంటే ఏదైనా ప్రత్యేక సాధన కాదనీ ఇది ఒక నిర్దిష్ట మార్గం అనీ అక్కడికి చేరుకోవడానికి, చేయవలసినవి చాలా ఉన్నాయని అందులో ఆధ్యాత్మిక చింతన ఒకటని దాతలు వారి భక్తిని చాటుకున్నారు. జానంపేట గ్రామం, గుండుకేరిలో హనుమాన్ మరియు శివాలయం నిర్మిస్తున్న దేవాలయాల పునర్నిర్మాణానికి దాతలు విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శరీరం, మనస్సు, భావోద్వేగాలు మరియు శక్తులను ఒక నిర్దిష్ట స్థాయి పరిపక్వతకు పెంపొందించుకుంటే, మీలో ఇంకేదో వికసిస్తుంది - అదే ఆధ్యాత్మికత అని అన్నారు. మీ హేతువు అపరిపక్వంగా ఉన్నప్పుడు, అది ప్రతిదానిని అనుమానిస్తుందని, మీ హేతుబద్ధత పరిపక్వం చెందినప్పుడు, అది ప్రతిదీ పూర్తిగా భిన్నమైన కాంతిలో చూస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సృష్టిలో ఆధ్యాత్మికతకు ఉన్న శక్తి మరొకటి లేదని అన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో స్థానిక కమిటీ నాయకులు తదితరులు ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయం చేయాలని అన్నారు..

# చదరంగం ఆటలో సీనియర్ నిర్ణేతగా షాద్ నగర్ చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్





**-సీనియర్ నిర్ణేతగా ఎన్నికవ్వడం ప్రతి చెస్ కోచ్ ఒక కల**

**-సాధించినందుకు గర్వంగా ఉందన్న షాద్ నగర్ అకాడమీ కోచ్ వానరసి జగన్**

**షాద్ నగర్,14 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎత్తులకు పై ఎత్తులు వేసి ఎదుటివారిని చిత్తు చేసి గెలవడమే చదరంగం ఆట యొక్క ప్రత్యేకత. అలాంటి ప్రత్యేకమైన ఆటలో కోచ్ గా ఉంటూ న్యాయ నిర్ణేతగా ఎన్నిక కావాలనేది చదరంగం ఆట యొక్క ప్రతి కోచ్ కు ఉంటుంది. అలాంటి ఒక అవకాశాన్ని అందిపుచ్చుకొని సీనియర్ న్యాయ నిర్ణేతగా టైటిల్ అందుకోవడం మన షాద్ నగర్ వాసికి దక్కింది.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన షాద్ నగర్ చెస్ కోచ్ వానరసి జగన్ గత నెల ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం లో ఓ హోటల్లో నవంబర్ 30, డిసెంబర్ 01 రెండు రోజుల పాటు జరిగిన చెస్ న్యాయం నిర్ణేతల (ఆర్బిటర్) సదస్సులో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకుని పరీక్ష రాయడం జరిగింది. అనంతరం డిసెంబర్ 12 గురువారం నా నిర్ణేతల ఫలితాలు విడుదల చేయడం జరిగింది. ఈ ఫలితాలలో షాద్ నగర్ కి చెందిన చెస్ కోచ్ వానరసి జగన్ ఉత్తమ ప్రతిభ ఘనపరిచి (SNA) సీనియర్ నేషనల్ ఆర్బిటర్ గా టైటిల్ ని దక్కించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చెస్ క్రీడాకారులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. చెస్ టోర్నమెంట్ సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు మెలకువలను తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇంటర్నేషనల్ నిర్ణేతలు అనంతరామన్, పాల్, వివరించి తనకు టైటిల్ పొందడంలో సహాయపడినందుకు షాద్ నగర్ చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రారంభమైన యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా 6వ మహాసభలు.!

**-షాద్ నగర్ పట్టణంలో భారీ ర్యాలీ అనంతరం యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ..!**




**షాద్ నగర్,డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా 6వ మహాసభలు షాద్ నగర్ పట్టణంలోని ఠాగూర్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాములయ్య యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఎస్టిఎఫ్ఐ జెండాను యుటిఎఫ్ సీనియర్ నాయకులు అర్జున్ రెడ్డి ఆవిష్కరణ చేయగా జాతీయ జెండాను పి.వెంకట రమణ ఆవిష్కరణ చేశారు.



షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సన్మానిస్తున్న టీఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే. జంగయ్య..!

## 199 బూత్ కమిటీ నియామకం



**ఆమనగల్లు, డిసెంబరు 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** -ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు చంద్రయన్ పల్లి తాండ 199 బూత్ కమిటీ అధ్యక్షుడిగా జటావత్ శ్రీకాంత్ ను తండా వాసులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి శక్తి కేంద్రం ఇంచార్జ్, 15వ వార్డ్ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిజేపి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, కృష్ణ నాయక్, తాండ నాయకులు లస్కర్, గోపాల్, లక్ష్మణ్, రాములు, సోమ్లా, లక్య, సజ్యు, దేవ్ సింగ్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి ఇరుముడి పడిపూజ



**కడ్తాల్, డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతి ఒక్కరు దైవ మార్గంలో నడవాలని కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ అన్నారు.కడ్తాల్ మండలం మైసిగండి శివాలయంలో భీముడు,గండికోట శ్రీను అయ్యప్ప గురుస్వాముల ఆధ్వర్యంలో శనివారం శివాలయంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు నిర్వహించిన మహా ఇరుముడి పూజకు కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వాములకు అన్నప్రసాదం, కార్యక్రమం నిర్వహించారు. శబరిమలైకు బయలుదేరుతున్న అయ్యప్ప స్వాములకు పూలమాలతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గురురు లక్ష్మి నరసింహ రెడ్డి, సాములు గోపి స్వామి, శేఖర్ స్వామి, కత్తి స్వాములు, నాయకులు రామచంద్రి, నరేందర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, వరికుప్పల వెంకటేష్, మాదారం మహేష్ గౌడ్, సైదప్ప, కిరణ్ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల కామన్ డైట్ లో ఆహారభద్రత పాటించాలి

అమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న అమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్

**కడ్తాల్,డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి,ఉన్నతమైన స్థానాలలో నిలబెట్టడానికి ప్రతిఒక్కరు కష్టపడి పనిచేయాలని అమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్ అన్నారు. శనివారం కడ్తాల్ గిరిజన బాలుర ఆశ్రమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ కార్యక్రమంలో పాల్గొని అధ్యపకులకు పలు సూచనలు చేశారు.కామన్ డైట్ ద్వారా విద్యార్థులకు భోజన ఏర్పాటులో సమయపాలన పాటించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, మండల వ్యవసాయ అధికారిని శ్రీలత, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యట నరసింహ, మాజీ ఎంపీటీసీలు గుదురు శ్రీనివాస్ రెడ్డి,చేగురి వెంకటేష్ నాయకులు బిక్యానాయక్, బిచ్యా నాయక్, మలె మల్లేష్ గౌడ్, యాదయ్య గౌడ్, గురిగళ్ళ రామచంద్రయ్య, హాస్టల్ వార్డెన్ రాములు, అధ్యాపకులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు దత్తజయంతి మహోత్సవం

**ఆమనగల్లు, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేడు దత్తజయంతి మహోత్సవం సందర్భంగా సాయిబాబా ఆలయంలో శ్రీ దత్త హోమం నిర్వహించబడుతుంది అని శ్రీ షిర్డీ సేవా సంస్థాన్ ఓ ప్రకటనలో వెల్లడించింది. "ఉదయం 9.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మా ప్రార్థన," అని ఆలయ కమిటీ తెలియజేసింది.

## సినిమా వాళ్లకు చట్టాలు వర్తించవా?



**హైదరాబాద్, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
"సినిమా నటులైతే మాత్రం చట్టం నుండి మినహాయించాలా?" అని బీసీ నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ, "మహిళ చనిపోతే సానుభూతి తెలపని నాయకులు, నటుడిని అరెస్టు చేయగానే ఖండిస్తారా? సీఎం మాటల్లో తప్పేముంది?" అని అన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్, "సినిమా నటులకూ చట్టాలు వర్తిస్తాయి. చట్టం ముందు అందరూ సమానమే. మహిళ చనిపోతే సానుభూతి తెలియజేయడం మానవతా ధర్మం. నటుడిని అరెస్టు చేయగానే ఖండించడం అన్యాయం," అని వ్యాఖ్యానించారు.

## నాగర్ కర్నూల్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ మృతి



**నాగర్ కర్నూల్, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
– నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని తాడూరు మండలంలో ఇంద్రకల్ గ్రామానికి చెందిన జ్యోతి (30) జలుబు కారణంగా ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్ళి చికిత్స పొందారు.ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం జ్యోతి, పక్కనే ఉన్న మెడికల్ షాప్ నుండి టాబ్లెట్స్ తీసుకుని గేటు దగ్గరికి వచ్చేసరికి పడిపోయి మృతి చెందారు.ఈ సంఘటనపై బీఎస్పీ మాజీ అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆరోపణలు చేస్తూ, ఆస్పత్రి వద్ద ధర్నా చేయడం, ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది.

# పలు గురుకులాలు, వసతి గృహాలను తనిఖీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





**దేవరకొండ, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
– దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలంలోని చెన్నారం గేట్ వద్ద ఉన్న ట్రైబల్ గురుకుల (బాలికల) పాఠశాలలో, దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి వద్ద ఉన్న బీసీ వెల్ఫేర్ (బాలుర) పాఠశాలలో, మరియు పెంచికల్ పహాడ్ లో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ (బాలికల) గురుకుల పాఠశాలలు మరియు హాస్టల్ లను తనిఖీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు 40% పెంచిన అనంతరం విద్యార్థులకు అందుతున్న భోజన మరియు ఇతర సౌకర్యాల గురించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. గురుకుల హాస్టల్ లో భోజనం సరిగ్గా పెడుతున్నారా, బోధన సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.క్రమశిక్షణ, అంకిత సాధన లక్ష్యంతో చదువులు పూర్తి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా మరియు పాఠ్యేతర మౌలిక సదుపాయాలు అందించడంలో నిబద్ధతను చూపిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్లో మరింత నాణ్యమైన ఆహారాన్ని అందించడంతోపాటు



మెరుగైన విద్య బోధనా అవకాశాలను పెంపొందించడానికి సర్కార్ ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే గారు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో మెస్ కాస్మోటిక్ చార్జీలు 40% పెంచడం, సన్నబియ్యం అందించడం ద్వారా పిల్లలు హర్షిస్తున్నారని తెలిపారు.ఆహార భద్రతను నిర్ధారించడానికి మరియు ఆహార కాలుష్యం మరియు ఆహార వల్ల కలిగే అనారోగ్యాలను నివారించడానికి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి మరియు సంస్థ స్థాయిలో ఆహార భద్రత కోసం టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసిందని అన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలని అధికారులను సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలలో ప్రతి ఒక్కటి అమలు చేస్తూ, అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని మెరుగుపడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు.అనంతరం, కొండమల్లేపల్లి మండలంలోని చెన్నారం గేట్ వద్ద ఉన్న ట్రైబల్ గురుకుల (బాలికల) పాఠశాల విద్యార్థులు త్రాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యేను కోరగా, వెంటనే స్పందించి బోర్ వెల్ వాహనాన్ని పిలిపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, కొండమల్లేపల్లి మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి, మాజి వైస్ ఎంపీపీ కాసార్ల వేంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యూనూస్, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, ఆర్డీవో రమణా రెడ్డి, ఆర్సీవో బాల్ రాం నాయక్, ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి, విజేందర్ రెడ్డి, నాటరాజు, ఎంపిడిఓ బాలరాజు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ లింగం, మాజి ఎంపీటీసీ జగన్, లాలు నాయక్, మాజి సర్పంచులు రాములు నాయక్, సత్యం, భీమ్సింగ్, బాల్సింగ్, రాములు, యువజన కాంగ్రెస్ పిఎ మండల అధ్యక్షులు రమేష్ నాయక్, యువ నాయకులు బాబు రామ్ నాయక్, ప్రిన్సిపాల్స్ శారధ, కళ్యాణి, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసం మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం





**రంగారెడ్డి జిల్లా డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది . ఇబ్రహింపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ నూతన



కమిటీ చైర్మన్‌గా కంబాలపల్లి గురునాథ్ రెడ్డి , వైస్ చైర్మన్ మరియు పాలకవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వారికి ఇబ్రహింపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లు ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## కాటమయ్య రక్షణ కవచం శిక్షణ కార్యక్రమం




**ఆమనగల్లు, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
– ప్రోహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్, ఆమనగల్లు పరిధిలోని నాలుగు మండలాల్లో కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మరియు మాడుగులలో గీత కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచం శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుంది అని ఈ కార్యక్రమానికి సొసైటీ లైసెన్స్ మరియు లైసెన్స్ కాపీ కలిగి ఉన్న తాటి చెట్టు ఎక్కే గీత కార్మికులు అర్హులు అని ఆమనగలు ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చోహన్ తెలిపారు.ఈ శిక్షణ సోమవారం, 16 డిసెంబర్ 2024 నుంచి ప్రారంభమవుతుంది.ప్రోగ్రామ్ అనుసంధానం ప్రోహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్, ఆమనగల్లు ద్వారా జరుగుతుంది అని ఆయన పేర్కొన్నారు.

## మీటింగ్ హాల్ ను ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
శేరిగూడ గ్రామంలో ఉన్న ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ భవనం లో నూతనంగా నిర్మించిన మీటింగ్ హాల్ ను ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ రంగారెడ్డి తో పాటు డీసీసీబీ చైర్మన్ మరియు అధికారులు జిల్లా కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతోపాటు బ్యాంక్ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

# కడ్తాలలో 765 KV హైటెన్షన్ విద్యుత్ ప్రణాళికతో రైతులకు ఇబ్బంది

**కడ్తాల్,డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రానికి సమీపంలో 765 కేవీ విద్యుత్ హైటెన్షన్ పోల్ సర్వే లైన్ మార్చాలని మండల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్ లో బాధిత రైతులు మరియు బీదర్ పవర్ ట్రాన్స్మిషన్ ప్రైవేట్ లిమిటెడ్ డిజిఎం సంతోష్ , ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రం సమీపంలోని సన్న చిన్న కారు రైతుల పొలాల మీదుగా బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్ అథారిటీ ద్వారా బళ్లారీ నుంచి మిర్యాన్ పెట్ వరకు హైటెన్షన్ లైన్ ఏర్పాటు క్రమంలో,అందులో భాగంగా పోల్స్ వేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వేచేసి, లైన్ అలైన్మెంట్ మార్కింగ్ చేయడం ఎంత వరకు



-రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సమంజసమని ప్రశ్నించారు. మండల కేంద్రం మీదుగా గతంలో నాలుగు భారీ పవర్ గ్రిడ్ హైటె న్షన్ లైన్లు ఏర్పాటు చేయడంతో ఇప్పటికే చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు మరో లైన్ వేయడం వలన రైతుల కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రానికి 5 కి.మీ దూరంలో అగ్రి కల్చర్ జోన్, ప్రభుత్వ భూములు ఉన్నాయని, వెంటనే హైటెన్షన్ పోల్ సర్వే అలైన్మెంట్ను మార్చాలని కోరారు.బీదర్ దగ్గర 3000 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్ నుండి కరెంటు సరఫరాకు(స్తంభాలు,వైర్లు)మరొక 2700 ఎకరాల వ్యవసాయ భూమిని నిరుపయోగంగా మార్చుతున్నారని దుయ్యబట్టారు. ఫార్మా సిటీ కొరకు ఇప్పటికే రైతులనుండి తీసుకున్న 18000 ఎకరాల భూమిలో ఈ పవర్ గ్రిడ్ ఏర్పాటు చేయడంతో కనీసం ఈ ప్రాంత రైతులకు న్యాయం చేసినవారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ కదారి రామకృష్ణ,జంగా రెడ్డి,గూడూరు మల్లికార్జున్ రెడ్డి,జనార్దన్,ఎలగమోని పాండు,అభిషేక్, క్యామ రాజేష్, బోసు రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పూజలో చిన్నారుల నృత్య ప్రదర్శన


-అంబా భవాని దేవాలయంలో
-గిరీషన్ నాయర్ గురు స్వామి ఆధ్వర్యంలో



**షాద్ నగర్,డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** చిన్నారుల నృత్యం ఆ అంబా భవాని రూపం అని గిరిషన్ నాయర్ గురుస్వామి అన్నారు. శుక్రవారం అంబా భవాని దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో ప్రబోదయ డాన్స్ & మ్యూజిక్ నృత్య గురువు రంజు ప్రవీణ శిష్య బృందం అక్షయ, తపస్విని, మన్యశ్రీ, రుతీష, స్వరాజ్య, హితిక, ఆరధ్య, శాన్వి సిద్ధి వినాయక, అయ్యప్ప కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన వీక్షకులకు ఎంతగానో కనువిందు పరిచాయి. అనంతరం పడిపూజ కార్యక్రమంలో భక్తి పాటలతో భజన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించిన ఎలికట్ట గ్రామ అయ్యప్ప సేవాసమితి స్వాములు.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి...

-ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
-చేగూర్ లో ఎస్ కే కిచెన్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,14 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):** యువత స్వయం ఉపాధితో సొంతంగా తమ కాళ్ళపై నిలబడి ఆర్థిక రంగంలో ఎదిగి, ఆర్థికంగా బలపడినప్పుడే కుటుంబాభివృద్ధి తద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. ఈరోజు నందిగామ మండలం చేగూరు గ్రామంలో ఎస్ కే కిచెన్ రెస్టారెంట్ ని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కిచెన్ రెస్టారెంట్ యజమాని ఎలికట్ట శివకుమార్ సాదరంగా ఆహ్వానించి ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రెస్టారెంట్ నిర్వాహకుడు ఎలికట్ట శివకుమార్ కు వ్యాపారం బాగా అభివృద్ధి చెందాలని శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో చేగూరు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## మొదలైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

(మొదటి తరువాయి)
సంబంధించి మార్గ దర్శకాలను జారీ చేశారు. రోజుకు కనీసం 20 దరఖాస్తులను సర్వే చేయాలన్నది ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా ప్రతీ 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్ ఉండనున్నారు. పట్టణాల్లో వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్ ఉంటారు. అదే గ్రామాల్లో అయితే గ్రామ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది వివరాలు సేకరించనున్నారు. ఒకరోజు ముందుగానే సర్వే గురించి గ్రామాలు, వార్డులకు సమాచారం ఇచ్చారు. దీనికి సంబంధించి పత్రాలను రెడీ చేయాలని ఇప్పటికే తెలిపారు. ఇక కలెక్టర్లు, హౌసింగ్ శాఖ పీడీలు దిగువస్థాయికి వెళ్లి యాప్‌లో వివరాల నమోదు తీరును గమనిస్తున్నారు. ఇళ్లు కేటాయింపులో తొలుత వికలాంగులకు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కార్మికులు, ఆదివాసీలకు ప్రయార్టీ ఇవ్వనుంది ప్రభుత్వం. ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇక దరఖాస్తుదారుడు ఉన్న సొంత ఇల్లు లేదా అద్దె ఇంటి ఫోటోలు తీసి అందులో యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికితోడు వారికున్న స్థలాల వివరాలు సేకరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం ఆలోచన. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. కేవలం కార్యకర్తలకు మాత్రమే వచ్చాయి. ఈసారి అలా కాకుండా అసలైన లబ్ధిదారులను న్యాయం జరిగేలా చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఏడాదికి నాలుగున్నర లక్షల మంది ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఓవరాల్‌గా పరిశీలిస్తే రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆలోచన చేస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీ నెరవేరుతుందని అధికార పార్టీ భావిస్తోంది.

## అర్జున్ అరెస్టు, జైలు, బెయిల్ సినిమా సూపర్ హిట్

**హైదరాబాద్, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ అరెస్టు, జైలు, బెయిల్ వివాదం సినిమా సూపర్ హిట్ లా మారింది. ఈ వ్యవహారంలో పోలీసుల కథ, కోర్టు క్లైమాక్స్ బంపర్ హిట్ అని చెప్పవచ్చు. కేవలం 12 గంటల వ్యవధిలో సెలబ్రిటీ అల్లు అర్జున్ అరెస్టు, విచారణ, జైలు, బెయిల్ సీన్లు అన్ని పుష్ప -2 ప్రీమియర్ షోను తలదన్నేటట్లు జరిగాయి.

**సంధ్య థియేటర్ లో తొక్కిసలాట**
హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా చూడటానికి వచ్చిన అల్లు అర్జున్, తొక్కిసలాటలో ఒక మహిళ మృతికి కారణమయ్యారు. ఆమె కుమారుడు ఆసుపత్రిలో పోరాడుతున్నాడు.

**అర్జున్ అరెస్టు హైడ్రామా**
ఈ ఘటనకు సంబంధించి అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ అరెస్టు వ్యవహారంలో హైడ్రామా చోటు చేసుకుంది. ఒక కోర్టు 14 రోజుల రిమాండ్ విధిస్తే, మరో కోర్టు వెంటనే బెయిల్ ఇచ్చింది. కేవలం రూ. 50 వేల బాండ్ పేపర్‌తోనే మధ్యంతర బెయిల్ మంజూరైంది.

**సామాన్యులకు ఏమి దక్కుతుందో?**
ఇలాంటి న్యాయం సామాన్యులకు దక్కుతుందా? న్యాయస్థానాల్లో కూడా సెలబ్రిటీలకు ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయం ఉందా? అని న్యాయవాదులు అంటున్నారు. న్యాయ వ్యవస్థలు సామాన్యుల పట్ల కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే జైల్లో ఇంత మంది ఏళ్లతరబడి మగ్గి ఉండే పరిస్థితి ఉండేది కాదు. కోర్టుల్లో లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉండేవి కాదు.

**ముగింపు:** చట్టం కొందరికి చుట్టమై, అధికారం వారికి దాసోహం చేస్తుంటే సామాన్యులకు ఆమడ దూరంగా ఉంటుందనే అపఖ్యాతి కొనసాగుతూ ఉంటుంది. అల్లు అర్జున్ అరెస్టు, విడుదల ఉదంతం ఈ విషయాన్ని నిరూపిస్తుంది.

## 80 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



**నర్సంపేట ఆర్సీ, 14డిసెంబర్, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :నెక్కొండ మండలంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం వరంగల్ యూనియన్ తరపున ఐదవ తరగతి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికార సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్,జిల్లా వ్యవసాయ అధికారి కే అనురాధ, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారి రవీందర్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా కోశాధికారి కృష్ణారెడ్డి ఇతర సభ్యులు దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐదవ తరగతి విద్యార్థులకు 80 దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. నెక్కొండ తాసిల్దార్ రాజ్ కుమార్,మండల ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మమత ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి, రాష్ట్ర వ్యవసాధికారి సంఘం వైస్ చైర్మన్ అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం తరపున అనేక కార్యక్రమాలు ఉద్యోగస్తుల యోగక్షేమాలతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాలు కూడా చేపట్టడంలో భాగంగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. విద్యార్థులందరూ సద్వినియోగపరుచుకొవాలని కోరారు.తహసిల్దార్ మాట్లాడుతూ వ్యవసాయ అధికార సంఘం సభ్యుల్ని అభినందించారు. ఈ దుప్పట్లు పంపిణీ చేయడాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## అఖండ హరినామ సప్తాహాలో పాల్గొన్న శ్రీరాములు అందెల





**మహేశ్వరం, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** – మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ్ కాలనీలోని శ్రీకృష్ణ ఆలయ ప్రాంగణంలో మరాఠా మరియు లింగాయత్ సమాజ్ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ మహెూత్సవంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.శ్రీకృష్ణ మరియు దత్తాత్రేయ స్వామి ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా సామూహిక భగవద్గీత పారాయణంతో, సంకీర్తనలతో మారుమోగింది.అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన నడవాలని, శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీధర్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు శాంత్ కుమార్, సంతోష్, బోడ హరికృష్ణ, నాగార్జున, సుమిత్ బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత ఆధార్ అప్‌డేట్ గడువు పొడగింపు

**న్యూఢిల్లీ, డిసెంబరు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** – ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడంపై కేంద్రం మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. నేటితో గడువు ముగియనుండగా, దాన్ని 14 జూన్ 2025 వరకు పొడగించింది.దీంతో ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలనుకునే వారికి ఇది శుభవార్త. ప్రతి పదేళ్లకు ప్రజలు తమ సమాచారాన్ని ఆధార్‌లో అప్‌డేట్ చేయాలి. వయసు, ఫోటో, చిరునామా మార్పులు చేసుకోవచ్చు. ఆధార్ సేవా కేంద్రం లేదా యుఐడిఏఐ వెబ్‌సైట్ ద్వారా ఈ మార్పులు ఉచితంగా చేసుకో



కామారెడ్డి పట్టణంలో 14వ వార్డు లో ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరంను ప్రారంభించిన కామారెడ్డి శాసనసభ్యులు శ్రీ కాటిపల్లి వెంకటరమణారెడ్డి గారు...

# అల్లు అర్జున్‌పై మాకు ఎలాంటి కక్ష లేదు

**మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా?**
**చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న మహేశ్ కుమార్ గౌడ్**



హైదరాబాద్,14డిసెంబర్,(నిలగిరి ఎక్స్‌ప్రెస్ )
సినీ నటుడు అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కక్ష లేదని, అయినా ఆయన కారణంగా ఓ మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా? అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులే కారణమన్నారు.తొక్కిసలాట కారణంగా ఓ పేద మహిళ చనిపోతే చర్యలు తీసుకోవద్దా? అన్నారు. అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగినప్పటికీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చట్ట ప్రకారమే అల్లు అర్జున్‌పై కేసు పెట్టారని, అరెస్ట్ చేశారని, ఆ తర్వాత కోర్టు బెయిల్ (మధ్యంతర) కూడా ఇచ్చిందన్నారు. ఏ నటుడిపై కూడా కాంగ్రెస్ పార్టీకి కోపం లేదన్నారు. తమకు సినిమా వారి పట్ల ప్రేమే ఉందన్నారు.సినిమా తారలపై కేసులు అన్నీ చట్టం పరిధిలోనివే అన్నారు. అల్లు అర్జున్‌పై పెట్టిన కేసును కాంగ్రెస్ పార్టీకి ఆపాదించవద్దని కోరారు. దీనిని అధికార పార్టీకి ఆపాదించే ప్రయత్నం తెలంగాణ బీజేపీ నేతలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

# ఢిల్లీ నేరాలకూ రాజధానిగా మారింది

**-అమిత్ షాకు కేజ్రీవాల్ లేఖ**
**-డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయని ఆందోళన**



హైదరాబాద్, 14డిసెంబర్,(నిలగిరి ఎక్స్‌ప్రెస్ )
ఢిల్లీలో పెరుగుతున్న నేరాలపై కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాకు ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీ నేరాలకు కూడా రాజధానిగా మారిందని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయన్నారు. మహిళలపై నేరాలు, హత్యల్లో ఢిల్లీదే మొదటి స్థానమన్నారు. ఢిల్లీలో బాంబు బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయన్నారు. బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ శాంతిభద్రతలపై తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యను వివరించేందుకు తనకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని కోరారు. భారత్‌లోని మెట్రో నగరాలతో పోలిస్తే ఢిల్లీలోనే అత్యధికంగా నేరాలు జరుగుతున్నాయని విమర్శించారు. నేరాల కారణంగా ఢిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైమ్ క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయన్నారు.

# నేనెక్కడికీ పారిపోలేదు

**అసత్య వార్తాలపై స్పందించిన మోహన్‌బాబు**



హైదరాబాద్,14డిసెంబర్,(నిలగిరి ఎక్స్‌ప్రెస్ )
మంచు మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. జర్నలిస్టుపై దాడి ఘటనకు సంబంధించి హత్యాయత్నం కేసులో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా మోహన్ బాబు కనిపించలేదని సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అజ్ఞాతం వార్తలపై మోహన్ బాబు స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. ఇంట్లోనే వైద్య సంరక్షణలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా ముందస్తు బెయిల్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అందులో ఎలాంటి నిజం లేదు. నేను ఎక్కడికీ పారిపోలేదు. ప్రస్తుతం ఇంట్లో వైద్య సంరక్షణలో ఉన్నాను. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయొద్దని మీడియాను కోరుతున్నాను' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

# రేపు వన్‌నేషన్... వన్ ఎన్నికల బిల్లు

న్యూఢిల్లీ, తరంగాలు
దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ముసాయిదా బిల్లులు ఈనెల 16వ తేదీన లోక్‌సభ ముందుకు రానున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. డిసెంబర్ 16న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు




జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**-లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లలందరికీ క్రొత్త బట్టలు,న్యూట్రిషన్ సపోర్టు పంపిణి**
**-అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటపాటలు..**
**-లోడి సాంఘిక సేవా సంస్థ సేవలు అభినందనీయం..**
**-క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాల వరంగల్ బిషప్ డీ.డీ**








కాజీపేట,14డిసెంబర్,(నిలగిరి ఎక్స్‌ప్రెస్ )
లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో హెచ్ఐవి ఇన్ఫెక్టెడ్ అండ్ ఎఫెక్టెడ్,దివ్యాంగుల పిల్లలు 450 మంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాల వరంగల్ బిషప్ డీ.డీ మాట్లాడుతూ క్రిస్మస్ వెలుగులు సంతోషం ఎల్లపుడూ అందరికీ ఆ దేవుని ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లలందరికీ క్రొత్త బట్టలు,న్యూట్రిషన్ సపోర్టు చేస్తున్నట్లు తెలిపారు.వీరి సేవలు అభినందనీయమని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు ఎల్లప్పుడూ కొనసాగించాలని కోరుకుంటున్నానని పిల్లలను ఆశీర్వదించారు.ఈ వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటపాటలు పిల్లలను ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమం లో కాజీపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి,క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి,యూనియన్ బ్యాంక్ ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన లోడి సంస్థ స్టాఫ్ కోఆర్డినేటర్ వీరబాబు తన బృందం పాల్గొని భోజనాలు ఏర్పాటు చేసి అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా

**-థియేటర్?లో అనుకోకుండా జరిగిన ఘటన**
**-ఘటనలో నా ప్రమేయం లేదు: అల్లు అర్జున్**
**-త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా**
**-చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్**
**-అల్లు అర్జున్ అరెస్టును ఖండినిచిన సినీ ప్రముఖులు**



హైదరాబాద్,14డిసెంబర్,(నిలగిరి ఎక్స్‌ప్రెస్ )
తనపై నమోదైన కేసుకు సంబంధించి అనేక విషయాలు మాట్లాడాలని ఉన్నా, కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నట్లు అల్లు అర్జున్ స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ వద్ద విషాదకర సంఘటన జరగడం పట్ల మరోసారి బాధిత కుటుంబానికి క్షమాపణలు చెప్పిన ఆయన, త్వరలోనే ఆ కుటుంబాన్ని కలుస్తానని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తనకు మద్దతు ఇస్తున్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై చూపించిన ప్రేమ, అభిమానానికి అభిమానులకు, దేశవ్యాప్తంగా మద్దతిచ్చిన మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నానంటూ అల్లు అర్జున్ పేర్కొన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగింది అనుకోని ఘటన అని, అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా సంధ్య థియేటర్‌కు వెళ్తున్నానని, ఇప్పటి వరకు 30 సార్లు సంధ్య థియేటర్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఇలాంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదని అన్నారు. మరోవైపు జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్?కు ప్రముఖుల నుంచి పరామర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందమూరి బాలకృష్ణ స్వయంగా అల్లు అరవింద్?కు ఫోన్ చేసి అల్లు అర్జున్?తో మాట్లాడి పరామర్శించారు. ఈ మేరకు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'పుష్ప' దర్శక నిర్మాతలతో పాటు హీరోలు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, రానా, నాగచైతన్య, సుధీర్ బాబు, దర్శకులు రాఘవేంద్రరావు, కొరటాల శివ, వంశి పైడిపల్లి, బి.గోపాల్?, ఆర్. నారాయణమూర్తి, నిర్మాతలు సురేశ్? బాబు, దిల్ రాజు, బీవీఎన్?ఎస్ ప్రసాద్, సంగీత దర్శకుడు తమన్ సహా పలువురు సన్నిహితులు, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్?లు అల్లు అర్జున్?ను కలిసి మద్దతు ప్రకటించారు. కాసేపు అల్లు అరవింద్, అల్లు అర్జున్?లతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ముఖ్యంగా చిరంజీవి సతీమణి సురేఖ అల్లుఅర్జున్ నివాసానికి చేరుకోగానే సోదరుడు అల్లు అరవింద్ దగ్గరుండి బన్నీ వద్దకు తీసుకెళ్లారు. తనను హత్తుకొని సురేఖ ఒకింత భావోద్వేగానికి గురికావడంతో అల్లు అర్జున్ కళ్లు చెమ్మగిల్లాయి. ఇలా సినీ, రాజకీయ ప్రముఖులు, సన్నిహితులతో అల్లు అర్జున్ నివాసం వద్ద సందడి నెలకొంది. మరోవైపు అభిమానులు ఎవరూ అర్జున్ నివాసానికి రాకుండా పోలీసులు మూడు వైపుల బారికెడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అల్లుఅర్జున్ అరెస్టుపై యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అరెస్టును ఖండిస్తూ పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు నాని తెలిపారు. మంచి సమాజంలో జీవించాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని, ఆ ఘటన నుంచి పరిశ్రమ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని నిందించడం సరైనది కాదని నాని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ కూడా ఇదే అంశంపై ఓ సినీ వేడుకలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరని, జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్ల చుట్టుపక్కల వారికి సూచిస్తుంటారని వరుణ్ ధావన్ తెలిపారు. ఈ విషయంలో ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయమన్నారు. పుష్ప-2 కథానాయిక రష్మిక కూడా బన్నీ అరెస్టుపై ఆవేదన వ్యక్తం చేసింది